ప్రజా న్యూస్ నెటవర్క్
దినపత్రిక | యూట్యూబ్ ఛానల్
విలేకరులు కావలెను
రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి మీ జిల్లా, మీ మండలం, మీ గ్రామంలో మీ చుట్టూ ఉన్న సమస్యలపై మీక్రు అవగాహన ఉందా.? వాటిని వార్తలుగా మార్చి ఇచ్చే సత్తా మీలో ఉందా..? అయితే మీరు విలేకరులుగా ఉపయోగాసదుతారు..
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టీమ్తున్న వెలవడుతున్న ప్రజా న్యూస్ నెటవర్క్ దినపత్రిక మదియు యూట్యూట్ ఛానల్ లో పనిచేండానికి రాష్ట్రంలోని జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల వారీగా విలేకరులు కావలెను..
యడ్ టార్గెట్ లేదు | సీనియర్లకు ప్రాధాన్యత | సంప్రదించండి
సెల్ నెంబర్: 9393879363

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 165,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, పెల : 02,శనివారం , తేదీ : 17-10-2026

జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్



- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జనసేన ప్రచార రథం ప్రారంభం
- 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్'ను జెండా ఊపి ప్రారంభించిన పవన్ కల్యాణ్



ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం: కవిత

- ఖైరతాబాద్ ఉపఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందన్న కవిత



అమెరికా మంత్రి పర్యటన: జైశంకర్‌పై రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై రాహుల్ గాంధీ విమర్శలు
విదేశాంగ మంత్రి జైశంకర్‌ను 'రూబియో సిబ్బంది' అంటూ పరోక్షంగా వ్యాఖ్యలు
విదేశాంగ శాఖ అధికారులు గందరగోళంలో ఉన్నారంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!

వీలైనంత త్వరగా ఒప్పందాన్ని ముగిస్తామన్న కేంద్రమంత్రి నిర్మల

ఒప్పందం మొదటి దశ పూర్తయిందని, లీగల్ డ్రాఫ్ట్ సిద్ధమవుతోందని వెల్లడి
ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని స్పష్టం
బ్యాంకాక్‌లో జరిగిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ సమావేశాల్లో వ్యాఖ్యలు



ఢిల్లీ: భారత్-అమెరికా మధ్య ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని మిగతా 2 లో

జెలెన్‌స్కీ సరైన వ్యక్తి కాదు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై ట్రంప్ తీవ్ర విమర్శలు

- పుతిన్‌తో కంటే జెలెన్‌స్కీతో వ్యవహరించడమే కష్టమన్న ట్రంప్
- ఉక్రెయిన్ ప్రజలు మరో వ్యక్తిని ఎన్నుకుంటే మంచిదని సూచన



ఢిల్లీ: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జెలెన్‌స్కీ అమెరికాతో మిగతా 2 లో



రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ
- పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య

హైదరాబాద్: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. మిగతా 2 లో

జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన

తెలంగాణకు మరో దిగ్గజ కంపెనీ.. సీఎం రేవంత్‌తో హ్యుందాయ్ ప్రతినిధుల భేటీ

- సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధులు
- ఈ కేంద్రం ద్వారా 4,275 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి
- అనుమతులు వేగంగా జారీ చేయాలని అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు మిగతా 2 లో



ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.. 1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్

- తెలంగాణలో నీటి ఎద్దడికి కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని కేటీఆర్ ఆరోపణ
- 1,000 టీఎంసీల గోదావరి, కృష్ణా జలాలు వృథాగా దిగువకు వెళ్లాయని వ్యాఖ్య
- కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించలేదని విమర్శ
- పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి పంపులు ఆన్ చేయలేదని ఆరోపణ
- ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు ప్రణాళికలు లేవని మండిపాటు
- పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను ఏపీ తరలించిందని వ్యాఖ్య



విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్.. నారా భువనేశ్వరికి చంద్రబాబు అభినందనలు

- విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రం ఏర్పాటును అభినందించిన సీఎం చంద్రబాబు
- సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బృందానికి ప్రత్యేక అభినందనలు
- తలసేమియా చిన్నారులకు ఉచిత రక్తం అందించడం గొప్ప మానవీయ సేవ అని కొనియాడారు
- విద్యా, వైద్య రంగాల్లో ట్రస్ట్ అందిస్తున్న సేవలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి
- ప్రాణ రక్షణే లక్ష్యంగా ట్రస్ట్ ముందుకు సాగాలని ఆకాంక్ష

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం చంద్రబాబు దంపతులు

- ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పణ
- ముఖ్యమంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు
- దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం
- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను వారు సమర్పించారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో మిగతా 2 లో

మద్యం సీసాలు పెట్టి అరెస్ట్ చేశారు.. ఇది పోలీసుల నాటకం: అంబటి రాంబాబు



- స్థానిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని అంబటి ఆరోపణ
- దాచేపల్లి అభ్యర్థిని మద్యం కేసులో అక్రమంగా ఇరికించారని విమర్శ
- ఏకగ్రీవాల కోసమే పోలీసులు తప్పుడు కేసులు పెడుతున్నారన్న అంబటి

జెలెన్‌స్కీ సరైన వ్యక్తి కాదు: ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జెలెన్‌స్కీ అమెరికాతో వ్యవహరించడానికి సరైన వ్యక్తి కాదని, రష్యా అధ్యక్షుడు పుతిన్ కంటే అతనితో చర్చలు జరపడమే కష్టంగా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ ప్రజలు మరో నాయకుడిని ఎన్నుకుంటే మంచిదని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా ఆయిల్ రిఫైనరీలపై ఉక్రెయిన్ మళ్ళీ దాడులు ప్రారంభించడంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులను అవమానకరంగా ఆయన అభివర్ణించారు. శాంతి కావాలని పైకి చెబుతూనే, జెలెన్‌స్కీ యుద్ధాన్ని కొనసాగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రపంచానికి ఇంధనం అవసరమైన తరుణంలో రిఫైనరీలపై దాడులు చేయడం సరికాదన్నారు. కొన్ని రోజుల క్రితం ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించిన 'ఇంధన కాల్పుల విరమణ' ఒప్పందాన్ని రష్యా గౌరవించలేదని ఉక్రెయిన్ ఆరోపించింది. విరామ సమయంలోనూ రష్యా తమ ఇంధన వ్యవస్థలపై దాడులు కొనసాగించిందని, అందుకే తాము తిరిగి దాడులు ప్రారంభించాల్సి వచ్చిందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. దాడులపై ఉన్న ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ఆయన తేల్చిచెప్పారు. ఈ పరిణామాల నడుమ, ఉక్రెయిన్ డ్రోన్లు రష్యాలోని రియాజాన్ ప్రాంతంలో ఉన్న ఆయిల్ రిఫైనరీపై దాడి చేయగా, భారీగా మంటలు చెలరేగాయి. మరోవైపు, మధ్య ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన డ్రోన్ దాడుల్లో ముగ్గురు పౌరులు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్ళీ తారస్థాయికి చేరాయి.

ఎల్‌నినోను ఎదుర్కొనడానికి ప్రజలకు అండగా నిలబడాలి

హైదరాబాద్: ఎల్‌నినో కారణంగా తలెత్తిన సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనడానికి రాష్ట్ర రైతాంగంతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రకృతి ప్రకోపించడంతో తలెత్తిన ఈ విపత్తును ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించాలని కోరారు. ఎల్‌నినో వల్ల ఉత్పన్నమైన పరిస్థితులపై దసరా పండుగ తర్వాత అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిస్థితి తీవ్రతపై ఆ సమావేశంలో అన్ని పార్టీల సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. ఆ తర్వాత నవంబర్ మొదటి వారంలో అఖిల పక్ష ప్రతినిధి బృందంతో కలిసి ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి గారిని కలిసి సహకారం కోరుతామని చెప్పారు. ఈ సంక్షోభ కాలం నుంచి గట్టెక్కడానికి తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి అన్ని శాఖలను అప్రమత్తం చేశారు.ముఖ్యమంత్రి అందుబాటులో ఉన్న మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమై ఎల్‌నినో ప్రభావం, వర్షాభావం, సాగు, తాగునీటి ఎద్దడి, తద్వారా ఉత్పన్నమయ్యే పరిస్థితులపై సమగ్రంగా సమీక్షించారు. ఎల్‌నినో కారణంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులు, తీసుకోవలసిన చర్యలపై ప్రణాళికల గురించి ముఖ్యమంత్రి వివరించి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రైతులు పెద్ద మనసుతో ఎండాకాలం పంటలు వేయడం తగ్గించుకోవాలి. ఒక సీజన్ పంట పండించే పనులను వాయిదా వేసుకొని, ఉన్న నీటిని తాగడానికి వినియోగించుకోవాలి. ఎల్‌నినోను ఎదుర్కొనడానికి ప్రజలకు అండగా నిలబడాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా, తప్పుడు ప్రచారం నమ్మి వరి పంటలు వేస్తే నీరు అందించలేక పంటలు ఎండిపోయి పెట్టుబడి నష్టపోవడమే కాకుండా మోటార్లు, మీటర్లు కాలిపోయే పరిస్థితులు తలెత్తుతాయి. పెద్దమనసుతో ఒక సీజన్‌ను వాయిదా వేసుకోవాలి. రైతులతో పాటు ఈ సంక్షోభ పరిస్థితుల్లో భూమిలేని నిరుపేద కూలీలను ఆదుకోవలసిన అవసరం ఉంది. ఈసారి 2.5 లక్షల మంది ఉపాధి హామీ కూలీ పనులకు వస్తున్నారు. ఉపాధి హామీ పనుల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి గారికి సూచించడం జరిగింది. ప్రస్తుత కాలంలో పంట నష్టపోయిన వారికి, ఎండాకాలంలో వాయిదా వేసుకునే పంట నష్టానికి కూడా కేంద్ర ప్రభుత్వం ప్రకృతి విపత్తుల నిధి నుంచి సహకారం అందించాలి. మార్చి నెలలో ఉండే ఎండలు ఇప్పుడే ఉన్నాయి. 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. రానున్న కాలంలో నీరు, విద్యుత్ విషయంలో తీవ్ర సమస్య ఎదుర్కోబోతున్నాం. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురుస్తాయని, ఆరుతడి పంటలు వేసుకోవాలని వర్షాకాలం ప్రారంభం నుంచి చెబుతూవచ్చాం. గడిచిన 3 సంవత్సరాల్లో సగటున 15 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండగా, ఈరోజు 20 వేల మెగావాట్లకు చేరుకుంది. 2014-15 నాటికి సగటున 6500 -- 7,000 మెగావాట్ల వినియోగం ఉండగా, ఈ 13 ఏళ్లలో 14 వేల మెగావాట్ల వినియోగం పెరిగింది. గడిచిన రెండేళ్లలో ఆరేడు వేల వినియోగం పెరిగింది. ఈ పరిస్థితుల్లో కూడా రైతులకు, పరిశ్రమలకు వీలైనంత మేరకు విద్యుత్ అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నాం. ఇంకో 15 - 20 రోజుల్లో వర్షాకాలం పంటలు కోతలు అయిపోతాయి. చేతికొచ్చిన పంట ఎండిపోకూడదు. రైతుకు నష్టం, కష్టం రాకూడదు. రైతును ఆదుకోవాలనే ఆలోచనతో.. మార్కెట్‌లో ఎక్కడ, ఏ రేటుకు దొరికినా విద్యుత్‌ను కొనుగోలు చేసి రైతులకు అందించే ప్రయత్నం చేస్తున్నాం. తెలంగాణ మాత్రమే కాకుండా అనేక రాష్ట్రాలు విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నాయి. ఉత్పత్తికన్నా వినియోగం పెరగడంతో విద్యుత్ లభించని పరిస్థితులు తలెత్తాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో రైతులు మనోధైర్యం కోల్పోకుండా ఉండాలని అన్ని రకాలుగా ప్రయత్నాలు చేశాం. చలికాలం ప్రారంభానికి ముందే రిజర్వాయర్లు వట్టిపోయే పరిస్థితులు వచ్చాయి. పోయిన సంవత్సరం ఇదే సమయానికి రిజర్వాయర్లలో 462 టీఎంసీల నీరుండగా, ఇప్పుడు 200 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. అందుబాటులో ఉన్న నీటిని రాబోయే జూన్ వరకు 8 నుంచి 10 నెలలు పొదుపుగా వాడుకోవలసిన అవసరముంది. తాగునీటికే కష్టమైన పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రంలో 24 వేల గ్రామాలకు మంచినీటి సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోని దాదాపు వంద దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా తీవ్రమైన నీటి ఎద్దడి, ఎండ వేడిమితో పాటు రకరకాల సమస్యలు ఉత్పన్నం కాబోతున్నాయని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించారు. ప్రజలు, ముఖ్యంగా రైతాంగం అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. ఎల్‌నినో ప్రభావం మొదటగా రైతాంగంపై ప్రభావం చూపనుంది. ముఖ్యంగా సాగునీరు, తాగునీరుతో పాటు విద్యుత్ రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. తద్వారా పరిశ్రమలు, ప్రజా జీవితం, దినసరి కార్యక్రమాలపైన కూడా తీవ్రమైన ప్రభావం పడనుంది. కనీవినీ ఎరుగని విద్యుత్ వినియోగం జరుగుతోంది. ఉత్పత్తి చేయగలిగిన రాష్ట్రాల నుంచి కేంద్రం సెంట్రల్ పూల్ నుంచి రాష్ట్రానికి సబ్సిడీపై అదనంగా విద్యుత్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మన అవసరాలకు అనుగుణంగా రాబోయే 10 నెలల వినియోగం ఎంత అవసరమో అంచనా వేసి అందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఆశిస్తున్నాం. ఒక విపత్తు సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వంతో పాటు రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీ, ఇతర రాజకీయ పార్టీలు, సంఘాలు, మహిళా, విద్యార్థి సంఘాలు సహకరించాలని విజ్ఞప్తి. ఈ ప్రకృతి విపత్తును జయించడానికి అందరి సహకారం కావాలి. ఎల్‌నినో విపత్తుకు సంబంధించి తప్పుడు సమాచారాన్ని ఎవరూ వ్యాప్తి చేయొద్దు. ఎల్‌నినో కారణంగా తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో 24 గంటల పాటు ప్రజలకు సరైన సమాచారం అందించడానికి ప్రత్యేకంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాం. అపోహలు, తప్పుడు ప్రచారం కల్పించకుండా ప్రభుత్వం తరఫున ఎప్పటికప్పుడు సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్‌తో ఒక వార్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తూ పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేసుకుంటూ భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తాం. సాగునీరు, తాగునీటిని ఆదా చేసుకోవడం, కూలీలకు పనులు కల్పించడంతో పాటు పశువులకు గ్రాసం, తాగునీరు అవసరాలకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఆరోగ్య పరంగా ఏ కష్టమొచ్చిన నిరుపేదలను ఆదుకోవడానికి వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి గారు సవివరంగా తెలిపారు. ఈ విపత్తు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి నేతృత్వంలో సబ్ కమిటీని నియమించారు. అలాగే ప్రజలకు ఎప్పటికప్పుడు అధికారికంగా సమాచారం అందించడానికి సీఎం సలహాదారు కే. రామకృష్ణా రావు గారిని నోడల్ అధికారిగా నియమించారు.

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను వారు సమర్పించారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారిని అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లారు. గర్భాలయంలో చంద్రబాబు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను, ఆయన అర్ధాంగి సారెను అమ్మవారికి సమర్పించారు. దర్శనం ముగిసిన అనంతరం, ఆలయ పండితులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయతీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం..

చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!

ఢిల్లీ: భారత్-అమెరికా మధ్య ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి దశ ఇప్పటికే ఖరారైందని, ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్ట్) సిద్ధం చేస్తున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తనకు వివరించారని నిర్మల తెలిపారు. త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంతో పాటు, ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుపై కూడా మంత్రి ప్రసంగించారు. అంతర్జాతీయంగా అనేక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తదుపరి కాలంలో, గత నాలుగైదేళ్లుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచిందని ఆమె గుర్తుచేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సమ్మిళిత వృద్ధి విధానాలు, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ వంటి చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆమె వివరించారు. ప్రజాధనం వినియోగం పట్ల ప్రభుత్వానికి పూర్తి జవాబుదారీతనం ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం: కవిత

హైదరాబాద్: తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో

ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. శుక్రవారం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ భేటీ సందర్భంగా తమ పెట్టుబడి ప్రణాళికలను సీఎంకు వారు వివరించారు. జహీరాబాద్‌లో నెలకొల్పబోయే ఆర్ అండ్ డీ కేంద్రం స్వరూపం, దాని ద్వారా లభించే ఉపాధి కల్పన వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలియజేశారు. హ్యుందాయ్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుండంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్.. నారా భువనేశ్వరికి చంద్రబాబు అభినందనలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలపై ప్రశంసల వర్షం కురిపించారు. విజయవాడలో కొత్తగా ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో, ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రక్తం అందక ఏ ఒక్క ప్రాణమూ ప్రమాదంలో పడకూడదనే గొప్ప సంకల్పంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన అర్ధాంగి, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఆమె బృందానికి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. "ఒక్కరి రక్తదానం ఆపదలో ఉన్న మరో కుటుంబానికి జీవన ప్రదాత అవుతుంది. ప్రాణాపాయంలో ఉన్నవారికి పునర్జన్మనిస్తుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించాలనే నిర్ణయం గొప్ప మానవీయ సేవ అని ఆయన కొనియాడారు. కేవలం బ్లడ్ బ్యాంక్ మాత్రమే కాకుండా, విద్యా, వైద్యం, మహిళా సాధికారత వంటి ఎన్నో రంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను చంద్రబాబు గుర్తుచేశారు. 'సంజీవని మొబైల్ క్లినిక్' ద్వారా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు చేరవేయడం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రతి సేవలో మానవత్వం, ప్రతి ప్రయత్నంలో ప్రాణ రక్షణే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ తన సేవలను మరింతగా విస్తరించి, ఎంతో మందికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

హైదరాబాద్: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

మద్యం సీసాలు పెట్టి అరెస్ట్ చేశారు.. ఇది పోలీసుల నాటకం: అంబటి రాంబాబు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను లక్ష్యంగా చేసుకుని అధికార కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని కుట్రలకు పాల్పడుతోందని వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. దాచేపల్లి నగర పంచాయతీ వైసీపీ అభ్యర్థి కొప్పుల రవికుమార్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ మద్యం అక్రమంగా నిల్వ ఉంచారనే నెపంతో పోలీసులు సోదాలు చేసి, వారే మద్యం సీసాలు పెట్టి నాటకీయంగా రవికుమార్‌ను అరెస్ట్ చేశారని అంబటి ఆరోపించారు. రవికుమార్ పోటీలో ఉంటే అధికార కూటమికి ఎందుకంత భయమని ఆయన ప్రశ్నించారు. తప్పుడు కేసులు పెట్టి, ఎన్నికలను ఏకగ్రీవం చేసుకోవడానికే ఈ అరెస్ట్ చేశారని విమర్శించారు. రవికుమార్ ఆర్థికంగా బలమైన కుటుంబానికి చెందినవారని, ఆయన తండ్రి సాంబయ్య గతంలో చైర్మన్‌గా పనిచేశారని గుర్తుచేశారు. వైసీపీ అభ్యర్థులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని అంబటి మండిపడ్డారు. నామినేషన్లకు అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇదే ప్రభుత్వం శాశ్వతంగా ఉండదని, పోలీసుల తీరు సరికాదని హెచ్చరించారు. రక్షించాల్సిన వారే భక్షించేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. వెంటనే రవికుమార్‌ను విడుదల చేసి, స్వేచ్ఛగా పోటీ చేసే అవకాశం కల్పించాలని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

మిథున్ రెడ్డి కాన్వాయ్ పై దాడి ఒక రాక్షస క్రీడ..

ఏపీలో జంగిల్ రాజ్ నడుస్తోంది: జగన్

అమరావతి: రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిపై పుంగనూరులో దాడి జరిగిందంటూ ఆ పార్టీ అధినేత జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటువంటి దాడులను ప్రోత్సహిస్తూ పాలిస్తున్నారని ఆయన మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేసేందుకు వెళుతున్న వైసీపీ అభ్యర్థులను, నాయకులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని, చంద్రబాబుకు హింస కొత్తేమీ కాదని జగన్ విమర్శించారు. పార్టీ లోక్‌సభాపక్ష నేతకు కూడా రక్షణ కల్పించలేని దుస్థితి నెలకొందన్నారు. ఓటమి భయంతోనే అధికార కూటమి దాడులకు దిగుతోందని, స్వేచ్ఛగా ఎన్నికలు జరిపే ఉద్దేశం వారికి లేదని ఆరోపించారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలోనే ఎన్నికలు సజావుగా సాధ్యమవుతాయని జగన్ స్పష్టం చేశారు. మరోవైపు, మిథున్ రెడ్డితో జగన్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పుంగనూరులో మిథున్ రెడ్డి కాన్వాయ్‌ను టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారని వైసీపీ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసం అయ్యాయని, మిథున్ రెడ్డి భద్రతా సిబ్బందికి గాయాలైనట్లు వైసీపీ వర్గాలు ఆరోపించాయి. అనంతరం అధికారులు ఆయన్ను నామిన

నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రత్యేక పూజలు



(సదాశివపేట మండలం) అక్టోబర్ 16: ప్రజా న్యూస్ నెట్‌వర్క్ ప్రతినిధి అనిల్ కుమార్..

దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సదాశివపేటలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవీ నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకలని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, కౌన్సిలర్ వైశాలి నాగరాజు గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



జోగిపేట, అక్టోబర్ 16 (ప్రజా న్యూస్ అందోల్ ప్రతినిధి మహమ్మద్ అబేద్):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతూ పండుగ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని పలువురు పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలు పండుగ శోభను సంతరించుకున్నాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మల్లాపూర్ గ్రామ అబాదీ సర్వే నెం. 84/1ను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని తహసీల్దార్‌ను కోరిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 16 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్):

మల్లాపూర్ గ్రామ అబాదీ పరిధిలోని సర్వే నెం. 84/1లో ఉన్న నివాస స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి, స్థానిక ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ మండలం తహసీల్దార్ ఫూల్ సింగ్ నీ స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. సర్వే నెం. 84/1లో అనేక సంవత్సరాలుగా నివాసం ఉంటున్న స్థానిక మల్లాపూర్ వాసులు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఇంటి నిర్మాణ అనుమతులు, ఆస్తుల మార్పిడి తదితర విషయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ అబాదీ పరిధిలోని నివాస స్థలాలకు సంబంధించి ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని, నిషేధిత జాబితా అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై తహసీల్దార్ ఫూల్ సింగ్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కమిటీ సభ్యుడు ఫైళ్ల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు

జీవీఎంసీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా భారీ పోలీస్ బందోబస్తు...



విశాఖపట్నం, అక్టోబర్ 16: ప్రజా న్యూస్ నెట్‌వర్క్, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు.

జీవీఎంసీ స్థానిక ఎన్నికల నేపథ్యంలో గాజువాక జోనల్ కార్యాలయంలో 19 వార్డులకు సంబంధించిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు జీవీఎంసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గాజువాక పోలీస్ స్టేషన్ సీఐ శ్రీ వాసు నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు ప్రతిపాదకులు/బలపరిచే వ్యక్తులకు మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని, మిగతా వారు 100 మీటర్ల పరిధికి అవతల ఉండాలని పోలీసులు సూచించారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

మూలా నక్షత్రం వేళ సరస్వతీ దేవి అలంకరణలో తలంపులమ్మ

లోవ ఆలయంలో అక్షరాభ్యాసాలు, సామూహిక సరస్వతీ పూజ.. విద్యార్థులకు వేద పండితుల ఆశీర్వచనం





తుని, అక్టోబర్ 16 ప్రజా న్యూస్ నెట్‌వర్క్:

లోవ గ్రామంలోని శ్రీ తలంపులమ్మ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రుల ఆరవ రోజు మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యాబుద్ధులను ప్రసాదించే శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పిల్లలకు మంచి విద్యను ప్రసాదించాలని కోరుకుంటూ తల్లిదండ్రులు ఆలయంలో అక్షరాభ్యాసాలు చేయించారు. భక్తుల కోసం సామూహిక సరస్వతీ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చదువుల తల్లిగా పూజలందుకునే సరస్వతీ దేవి కరుణాకటాక్షాలు పిల్లలపై ఉండాలని, వారు విద్యలో రాణించి ఉన్నత స్థితికి చేరుకోవాలని వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం అందించారు. అనంతరం పిల్లలకు పెన్సిళ్లు, పెన్నులు, పుస్తకాలను ప్రసాదంగా అందజేశారు. భక్తులకు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవి విశిష్టతను పండితులు వివరించారు. విద్య, జ్ఞానానికి అధిదేవతగా భావించే ఆమె సత్వగుణానికి, అంటే మంచితనానికి ప్రతీక అని తెలిపారు. నాలుగు చేతుల్లో పుస్తకం, జపమాల, నీటి కుండ, వీణను ధరించి ఉంటారని వివరించారు. సరస్వతీ దేవిని శారద, బ్రాహ్మణి, బ్రహ్మి, వాణి, వాచి, వర్ణేశ్వరి, కవిజిహ్వాగ్రవాసిని తదితర పేర్లతో పిలుస్తారని చెప్పారు. శారద అంటే సారాన్ని లేదా జ్ఞానాన్ని ప్రసాదించేది, బ్రాహ్మణి అంటే బ్రహ్మ శక్తి, బ్రహ్మి అంటే శాస్త్రాల దేవత అని వివరించారు. వాణి, వాచి అనే పేర్లు సంగీతం, పాటల ప్రవాహంతో పాటు మధురమైన, అనర్గళమైన ప్రసంగాన్ని సూచిస్తాయని తెలిపారు. వర్ణేశ్వరి అక్షరాల దేవత అని, కవిజిహ్వాగ్రవాసిని అంటే కవుల నాలుకపై నివసించేది అని పేర్కొన్నారు. నిజమైన విద్య అంటే కేవలం వాస్తవాలను తెలుసుకోవడమే కాదని, విచక్షణ, అవగాహన పెంపొందించుకుని సత్యాన్ని అసత్యం నుంచి వేరు చేయగల సామర్థ్యాన్ని సాధించడమని సరస్వతీ దేవి బోధిస్తుందని వివరించారు. శరన్నవరాత్రుల ఏడో రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం నిర్వహించే సామూహిక కుంకుమార్చనల్లో భక్తులందరూ పాల్గొనవచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.

తుని మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా మళ్ల మీనాక్షి

- కూటమి పొత్తులో జనసేనకు చైర్‌పర్సన్ అభ్యర్థిత్వం..

- మీనాక్షి పేరును ప్రకటించిన జనసేన పార్టీ నాయకులు యనమల కృష్ణుడు



తుని, అక్టోబర్ 16, ప్రజా న్యూస్ నెట్‌వర్క్:

తుని పురపాలక సంఘం చైర్‌పర్సన్ పదవికి జనసేన పార్టీ తరఫున మళ్ల మీనాక్షి పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ నేత యనమల కృష్ణుడు ప్రకటించారు. కూటమి పొత్తులో భాగంగా తుని మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిత్వాన్ని జనసేనకు కేటాయించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

కూటమిలో తెలుగుదేశం పార్టీకి చెందిన రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల గణేష్ తన భార్య మీనాక్షికి టీడీపీ తరఫున చైర్‌పర్సన్ టికెట్ ఆశించారు. అయితే గురువారం గణేష్, మీనాక్షి దంపతులు జనసేన పార్టీలో చేరారు. పార్టీ గుర్తు ఉన్న కండువా కప్పి యనమల కృష్ణుడు వారిని పార్టీలోకి ఆహ్వానించారు. మీనాక్షిని అభ్యర్థిగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు యనమల కృష్ణుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంతో పనిచేసి జనసేన అభ్యర్థి మళ్ల మీనాక్షి గణేష్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తుని నియోజకవర్గ జనసైనికుల పనితీరును గుర్తించి పురపాలక సంఘం చైర్‌పర్సన్ అభ్యర్థిత్వాన్ని జనసేనకు కేటాయించినందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానుల తరఫున అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కృష్ణుడు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను అభివృద్ధి ప్రదాతగా అభివర్ణించిన ఆయన, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా గ్రామగ్రామాన రహదారుల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని పేర్కొన్నారు. ప్రజల ఆదరణ పొందిన కూటమి పార్టీలు ప్రజల మన్ననలు అందుకుంటున్నాయని తెలిపారు. తుని మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా జనసేన నుంచి మళ్ల మీనాక్షి పేరు ప్రకటించడంతో జనసైనికుల్లో ఉత్సాహం నెలకొందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. యనమల కృష్ణుడు జనసేనలో చేరినప్పటి నుంచి పార్టీ రోజురోజుకూ అభివృద్ధి చెందుతూ బలోపేతం దిశగా సాగుతోందని వారు అభిప్రాయపడుతున్నారు.

చేజర్ల మండలాన్ని కైవసం చేసుకునే దిశగా కొమ్మి వ్యూహం

- రాజకీయ వ్యూహాల్లో ఆరితేరిన దిగ్గజం

-స్థానిక ఎన్నికల్లో తన సత్తా మరోసారి చూపనున్న కొమ్మి



లిచేజర్ల అక్టోబర్ 16 ప్రజాన్యూస్ నెట్ వర్క్ రిపోర్టర్, యు. ప్రవీణ్ కుమార్ :

ఆత్మకూరు నియోజవర్గ పరిధిలోని చేజర్ల మండలం ఆది నుంచి రాజకీయంగా ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మయ్య నాయుడు అడ్డాగా నిలుస్తోంది. ప్రస్తుత రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా చేజర్ల మండలాధ్యక్ష పదవి జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. జడ్పిటిసి జనరల్ మహిళకు కేటాయించడం జరిగింది.దీంతో ఆది నుంచి కొనసాగుతున్న కొమ్మి హవా ఈ స్థానిక సంస్థల ఎన్నికలలో ను అదే ఒరవడిని కొనసాగించేందుకు రిజర్వేషన్లు దోహద కారిగా మారాయి. మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాలలో తూర్పుపల్లి, మడపల్లి ఎంపిటిసి స్థానాలను జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. దీంతో ఈ రెండు స్థానాల్లో విజయం సాధించే అభ్యర్థులు మండల పీఠాన్ని దక్కించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తూర్పుపల్లి నుండి కూటమి అభ్యర్థిగా ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మయ్య నాయుడు సోదరుడు కొమ్మి సిద్దుల నాయుడు పోటీ చేస్తారని చర్చ సాగుతుంది. ఆయన ఆస్థానంలో విజయం సాధించి మండలాధ్యక్షుడుగా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.గత సార్వత్రిక ఎన్నికల్లో 1994 ,2004 సంవత్సరంలో కొమ్మి లక్ష్మయ్య నాయుడు ఆత్మకూరు శాసనసభ్యులుగా విజయం సాధించడంతోపాటు తన సొంత మండలం అయిన చేజర్లలో మంచి ఆధిక్యత సాధించారు. మండల వ్యవస్థ ఆరంభంలో చేజర్ల మండల అధ్యక్షుడిగా విజయం సాధించారు. ఆయన సతీమణి కొమ్మి ప్రమీలాదేవి చేజర్ల మండల జడ్పిటిసి సభ్యురాలుగా విజయ కేతనం ఎగరవేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విజయం సాధించడంలో కొమ్మి లక్ష్మయ్య నాయుడు కీలకపాత్ర పోషించారు. ఈ మండలం తో పాటు ఆత్మకూరు నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో కొమ్మి ప్రాధాన్యత ఎంతగానో ఉంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆయనకు అభిమానులు, అనుచరులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.కొమ్మి సిద్దుల నాయుడు మండలాధ్యక్షుడుగా ఎంపిక అయితే..కూటమి అధిష్టానం సహాయ సహకారాలతో మండలాన్ని విలక్షణ రీతిలో అభివృద్ధి చేయగలరని సర్వత్రాచర్చ సాగుతుంది. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మయ్య నాయుడు వ్యూహకర్తలుగా ఎలాంటి రాజకీయ సమీకరణాలను, ప్రత్యర్థుల ఎత్తులకు పైఎత్తులను ఎలా వేస్తారో చూడాలి.కొమ్మి సిద్దుల నాయుడు కూటమి అభ్యర్థిగా పోటీకి నిలిస్తే మండలంలోని అన్ని ఎంపిటిసి స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించు కొనే సత్తా కూడా ఆయనకు ఉందని అంటున్నారు.ప్రత్యర్థులు కూడా సిద్ధులు నాయుడు పై పోటీకి నిలిచేందుకు సాహసించరని చెబుతున్నారు. ఇక అంతిమ తీర్పు ఓటర్ల చేతుల్లో ఉంది.

పాల్వాయి దుర్గమ్మ సన్నిధిలో భక్తి పారవశ్యం

- ఘనంగా కనకదుర్గమ్మకు కుంకుమార్చన, అన్నదానం





గుర్రంపోడు, అక్టోబర్ 16: (ప్రజా న్యూస్ రిపోర్టర్)

గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలోని కనకదుర్గమ్మ దేవాలయంలో శుక్రవారం కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు నిమ్మగడ్డ సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమ అర్చన పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఈ పూజల్లో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం, కనకదుర్గమ్మ గుడి కమిటీ సభ్యులు మరియు దాతల సహకారంతో భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి గ్రామ మాజీ సర్పంచ్ రంగరాజు వెంకటేశ్వర్లు, మూడో వార్డు సభ్యులు కొండ్రపల్లి గిరి, ప్రముఖులు జోగు వెంకన్న, మామిళ్ళ శీను, వెంకటాపురం బిక్షం, వెంకటాపురం సత్యనారాయణ, జోగు శ్రీను తదితరులు పాల్గొన్నారు..

బతుకమ్మ వేడుకలకు ముస్తాబవుతున్న సంగారెడ్డి కింది బజార్ చెరువు కట్ట

- ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి,తోపాజి..

- సదాశివపేట మండలం రేజింతల్‌లో బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి

(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 16: ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువు కట్టపై బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్ పరిశీలించారు. కట్ట పొడవునా చేపడుతున్న విద్యుద్దీపాలంకరణ, కట్ట అంచుల్లో బారికేడ్ల ఏర్పాటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ ఘాట్లను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు.ఈసారి బతుకమ్మల నిమజ్జనం కోసం రెండు ఘాట్లను సిద్ధం చేస్తున్నామని, మెట్లకు రంగులు వేస్తున్నామని నిర్వాహకులు వివరించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన అవశేషాలను పూర్తిగా తొలగించినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు.

వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా 32 అడుగుల భారీ బతుకమ్మను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. దీని తయారీకి 16 టన్నుల స్టీల్, అలంకరణకు ఎనిమిది టన్నుల పూలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఐదు డీజే పాయింట్లు, ఘాట్ల వద్ద ఐదు లైటింగ్ టవర్లతో సహా మొత్తం 18 లైటింగ్ టవర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే 32 అడుగుల స్క్రీన్, లేజర్ లైటింగ్‌తో పాటు చెరువు కట్ట చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు బొంగుల రవి కూన సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



రేజింతల్‌లో బతుకమ్మ ఘాట్ ప్రారంభం

సదాశివపేట మండలం రేజింతల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్‌ను గురువారం నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిద్ధన్న, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ గడీల ఆశిరెడ్డి, నందికంది సర్పంచ్ విజయ్ భాస్కర్ రెడ్డి, ఇక్రిశతబాద్ సర్పంచ్ అనితా శ్రీనివాస్, మండల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్...



కుత్బుల్లాపూర్. అక్టోబర్.16.ప్రజా.న్యూస్. నెట్వర్క్ ..

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సోమయ్య నగర్ లో గల బతుకమ్మ కుంట వద్ద 5 లక్షల రూపాయలతో బోర్ వెల్ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ప్రారంభించినారు. కార్యక్రమంలో నాయకులు తోక యాదగిరి, గణేష్, మహేందర్, సతీష్, సత్తిరెడ్డి, నరసింహారెడ్డి, మనోజ్, కుమారస్వామి, ప్రకాష్, ప్రభాకర్, శ్రీను, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సీతారాంనగర్ కాలనీలో అమ్మవారి మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు





హుజూర్నగర్ అక్టోబర్ 16 (ప్రజా న్యూస్ నెట్వర్క్) :

హుజూర్నగర్,సీతారాంనగర్ కాలనీలో రామాలయం దగ్గర దేవి నవరాత్రుల ఉస్తవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడిన అమ్మవారి మండపం దగ్గర బతుకమ్మ పూజతో పాటు అమ్మవారికి ఘనంగా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు ఇ కార్యక్రమంలో భాగంగా సాయి బాబా ప్రత్యేక వేషధారణతో భక్తులను అలరించారు ఇ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇక్కడ ప్రతిరోజూ పూజా కార్యక్రమాలు కాలనీ వాసులంతా కలసి కుటుంబ సమేతంగా వచ్చి నిర్వహిస్తామని తెలిపారు , సాంస్కృతిక కార్యక్రమాలు మరియు పిల్లలు ఆటలు వంటి కార్యక్రమాలు ఎంతో ఉస్తాహంతో నిర్వహిస్తామని కోరారు పూజా కార్యక్రమాలలో ప్రతిరోజూ ప్రతిఒక్కరు పాల్గొని అమ్మవారి కృపా కటాక్షాలు పొందాలని తెలిపారు.

త్రిపురారం చెరువుల ఆక్రమణలపై బీజేపీ ముందస్తు హెచ్చరిక

- ఊర చెరువు, నాగయ్యకుంట పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన బీజేపీ మండల అధ్యక్షుడు రేమడాల రమేష్



త్రిపురారం మండలం, అక్టోబర్ 16, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, రిపోర్టర్ గాసిరాం:

త్రిపురారం ఊర చెరువు, నాగయ్యకుంట చెరువు ఆక్రమణల సమస్యపై బీజేపీ మండల అధ్యక్షుడు రేమడాల రమేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మిర్యాలగూడ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. చెరువుల ఆక్రమణల వల్ల భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై తహసీల్దార్‌ను, ప్రజావాణిలో అధికారులను సంప్రదించినా స్పందన లేదని రమేష్ ఆరోపించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలపై విచారణ జరిపి చెరువులను పరిరక్షించాలని కోరారు. “మన ఊరు.. మన చెరువు” నినాదంతో ప్రతి ఒక్కరూ నీటి వనరులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని

దర్శించుకున్న కేరళ రాష్ట్ర డీజీపీ రావడ ఆజాద్ చంద్రశేఖర్, ఐపీఎస్..

విశాఖపట్నం,అక్టోబర్ 16 : ప్రజా న్యూస్ నెట్వర్క్, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు.

కేరళ రాష్ట్ర పోలీస్ చీఫ్ (డీజీపీ), సీనియర్ ఐపీఎస్ అధికారి రావడ ఆజాద్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో,ఈరోజు ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు.ఆలయానికి విచ్చేసిన ఆయనకు సింహాచలం దేవస్థానం సహాయ కార్యనిర్వాహణాధికారి శ్రీ పిల్లా శ్రీనివాసరావు, పి ఆర్ ఓ నాయుడు,మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయం ప్రకారం, తొలుత రావడ ఆజాద్ చంద్రశేఖర్ మహిమాన్వితమైన ‘కప్పస్తంభం’ను ఆలింగనం చేసుకున్నారు. అనంతరం గర్భాలయంలో కొలువై ఉన్న శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్నారు

దర్శనానంతరం ఆలయ ఆస్థాన వేద పండితులు ఆయనకు వేద మంత్రోచ్ఛారణలతో వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనను శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. జ్ఞాపికగా స్వామివారి దివ్య చిత్రపటాన్ని బహూకరించారు.



సత్యసాయి జిల్లాలో విషాద ఘటన..

నీట మునిగి ఐదుగురు మహిళలు మృతి.. లోకేశ్ దిగ్భ్రాంతి



శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. పెనుకొండ సమీపంలోని గొల్లపల్లి జలాశయంలో ఈతకు వెళ్లి ఐదుగురు మహిళలు నీట మునిగి మృతి చెందారు. విహారయాత్ర కోసం వెళ్లిన వీరి జీవితాల్లో ఈ సంఘటన అంతులేని విషాదాన్ని నింపింది.

వివరాల్లోకి వెళితే, పెనుకొండ పట్టణంలోని దర్గాపేటకు చెందిన కొందరు మహిళలు శుక్రవారం విహారయాత్ర కోసం గొల్లపల్లి జలాశయానికి వెళ్లారు. వీరిలో ఐదుగురు సరదాగా ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు. అయితే, నీటి లోతు ఎక్కువగా ఉండటంతో ఊహించని విధంగా మునిగిపోయారు. సమీపంలో ఉన్నవారు వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులను మహీం, హసీనా, పుష్పలత, గాయత్రమ్మ, అశ్వినిగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం: మంత్రి లోకేశ్

ఈ దురదృష్టకర సంఘటనపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. “శ్రీ సత్యసాయి జిల్లా గొల్లపల్లి జలాశయం వద్దకు విహారయాత్రకు వెళ్లి ఐదుగురు మహిళలు మృత్యువాత పడటం చాలా బాధాకరం. మృతులకు నివాళులర్పిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది“ అని లోకేశ్ పేర్కొన్నారు.ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు మహిళలు ఒకేసారి మృతి చెందడంతో దర్గాపేటలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం శోకసంద్రంలో మునిగిపోయింది.ం

బ్యాంకర్లతో సమన్వయ సమావేశం నిర్వహించిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి

- సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతర పర్యవేక్షణతో భద్రతను పటిష్ఠం చేయాలని సూచనలు

- ఏటీఎంల వద్ద భద్రతా లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు పోలీసుల సూచన

సూర్యాపేట జిల్లా, అక్టోబర్ 16, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :

హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఏటీఎంలు, బ్యాంకుల భద్రతను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు బ్యాంకర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏటీఎంల భద్రత, నగదు భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరుపై చర్చించారు.



సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి :

ప్రతి ఏటీఎం వద్ద నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని పోలీసు అధికారులు సూచించారు. ఏటీఎంలలో భద్రతా వ్యవస్థను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, కెమెరాలు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేయించాలని తెలిపారు. ఏటీఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు.

భద్రతా చర్యల్లో బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలి :

బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఎలాంటి భద్రతా లోపాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఏదైనా అనుమానాస్పద ఘటన జరిగినా, చోరీకి సంబంధించిన సమాచారం అందినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. బ్యాంకు సిబ్బంది, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.



ప్రజల నగదు భద్రతకు ప్రాధాన్యం :

ప్రజలు ఏటీఎంల ద్వారా సురక్షితంగా నగదు లావాదేవీలు నిర్వహించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులు బ్యాంకర్లకు సూచించారు. పోలీసు శాఖ, బ్యాంకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఏటీఎంల భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా చోరీలు, ఇతర అవాంఛనీయ ఘటనలను నివారించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

AIPC చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మధుయాష్కి గౌడ్ అన్నకు శుభాకాంక్షలు తెలిపిన దాము మహేందర్ యాదవ్



న్యూఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (AIPC) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎంపీ శ్రీ మధుయాష్కి గౌడ్ అన్న గారిని కలిసి దాము మహేందర్ యాదవ్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ గారికి అభినందనలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలని, దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన నిపుణులను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానం చేస్తూ ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.దాము మహేందర్ యాదవ్అధికార ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ

భూ భారతి భూముల రీ-సర్వేపై గ్రామసభ నిర్వహణ



మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని వెంకటాపూర్ బి గ్రామంలో భూ భారతి భూముల రీ-సర్వేపై గ్రామసభ నిర్వహించారు. గురువారం గ్రామంలో నిర్వహించిన ఈ గ్రామసభలో భూముల రీ-సర్వే ప్రక్రియ, డిజిటల్ సర్వే వివరాలు, భూ యజమానులకు సంబంధించిన అంశాలపై అధికారులు చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా సర్వే అధికారి కిషన్ మాట్లాడుతూ, గ్రామంలో 495.36 గుంటల భూమికి సంబంధించిన డిజిటల్ సర్వే వివరాలను వెల్లడించారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణం, ఇతర భూ వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. భూ యజమానులకు తమ భూములకు సంబంధించిన వివరాలపై స్పష్టత కల్పించేందుకు రీ-సర్వే ప్రక్రియ దోహదపడుతుందని పేర్కొన్నారు.భూ భారతి కార్యక్రమంలో భాగంగా భూముల వివరాలను పరిశీలించి, రికార్డులను సక్రమంగా నమోదు చేయడంపై గ్రామసభలో వివరించినట్లు తెలిపారు. భూములకు సంబంధించిన సందేహాలు, సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. భూ సర్వే ప్రక్రియలో గ్రామ ప్రజల భాగస్వామ్యం కీలకమని అధికారులు పేర్కొన్నారు.ఈ గ్రామసభకు మెదక్ జిల్లా సర్వే అధికారి కిషన్, రెవెన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణ, తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, ఎంపీవో రామారావు, కౌడిపల్లి మండల సర్వేయర్, నర్సాపూర్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్, గ్రామ సర్పంచ్ దుర్గమ్మ సత్తయ్య, ఉపసర్పంచ్ సౌమ్య నాయక్, ప్రభాకర్ గౌడ్,సుమన్ గౌడ్, సురేష్, ముత్యాలు, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు మా నాన్న కష్టాలు చూడలేకే కేటీఆర్‌కు ట్వీట్ చేశా : బైరు అశ్విని





గుర్రంపోడు, అక్టోబర్ 16,ప్రజా న్యూస్ రిపోర్టర్

సాగునీరు, విద్యుత్ కొరతతో పంటలు ఎండిపోతూ రైతాంగం అల్లాడిపోతున్న తరుణంలో నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన రైతు బిడ్డ బైరు అశ్విని సోషల్ మీడియా వేదికగా చేసిన పోరాటం ప్రాధాన్యత సంతరించుకుంది. తమ గ్రామంలోని పంటల పరిస్థితిని వివరిస్తూ ఆమె ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు పంపిన సందేశంపై పార్టీ నాయకత్వం తక్షణమే స్పందించింది. కేటీఆర్ ఆదేశాల మేరకు నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ పోచంపల్లి గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.ముందుగా నోముల భగత్ ఆ గ్రామ రైతు బిడ్డ బైరు అశ్వినిని కలిసి, ఆమె ట్విట్టర్‌లో కేటీఆర్‌కు పంపిన సందేశం వెనుక ఉన్న కారణాలను, గ్రామంలో నెలకొన్న తీవ్రమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశ్విని మాట్లాడుతూ, “మా నాన్న పడుతున్న కష్టాలను, మా గ్రామంలోని రైతులు నీరు లేక పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూసి తట్టుకోలేకపోయాను. అందుకే మా బాధను పెద్ద సార్ల దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ట్విట్టర్‌లో మెసేజ్ చేశాను“ అని తన ఆవేదనను పంచుకున్నారు. అనంతరం గ్రామ రైతులు మాజీ ఎమ్మెల్యే వద్ద తమ కష్టాలను చెప్పుకున్నారు.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటల నాణ్యమైన కరెంట్ వచ్చేదని, తాము పొలాల దగ్గరకు వెళ్లి చూడకపోయినా పంటలు ఎంతో సస్యశ్యామలంగా పండేవని గుర్తుచేసుకున్నారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో కరెంట్, సాగునీరు లేక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి చామలేడు గ్రామం నుండి సుమారు 5 కిలోమీటర్ల మేర పైపులు వేసుకుని నీటిని తెచ్చుకుంటున్నామని, అయితే కనీసం రెండు మూడు గంటలు కూడా కరెంట్ ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఇచ్చే కొద్దిపాటి కరెంట్ కూడా పైపుల సగానికి రాకముందే నిలిచిపోతోందని కన్నీరు పెట్టుకున్నారు. రైతుల మరియు అశ్విని మాటలను పూర్తిగా ఆలకించిన నోముల భగత్ వారికి ధైర్యం చెప్పారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కెసిఆర్ ముఖ్యమంత్రిని బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ప్రాధాన్యత క్రమంలో పోచంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను సంపూర్ణంగా పూర్తి చేసి తీరుతామని, గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఇచ్చిన ఈ భరోసాతో పోచంపల్లి గ్రామ రైతులు, అశ్విని కుటుంబ సభ్యులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు ఉద్యమకారులు రైతులు తదితరులు పాల్గొన్నారు

యశోద హాస్పిటల్ మలక్ పేట వారు ఉచిత వైద్య శిభిరం ఏర్పాటుచేసిన గ్రామ సర్పంచ్ బైరు కొండల్ రెడ్డి



రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం జైత్వారం గ్రామ పంచాయతీ వద్ద టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ బైరు జగన్ మోహన్ రెడ్డి చొరవతో గ్రామ సర్పంచ్ బైరు కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది , ఇందులో భాగంగా ణతీ. జయశ్రీ జనరల్ ఫిజిషియన్ , ణతీ. ప్రతిభ ఒప్థోమలోజిసి , మధుర (సిస్టర్) , మణి (టెక్నీషియన్), వెంకటేష్ (టెక్నీషియన్) కలసి గ్రామంలో 150 వరకు పిల్లలు , పెద్దలు మరియు యువతకి వైద్య పరీక్షలు ధీ , షుగర్ , ఐ చెకప్ , ఆర్థోపెడిక్ , ఈసీజీ మరియు జనరల్ చెకప్ చేసారు , వీరికి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది , దీనిలో భాగంగా గ్రామ సర్పంచ్ బైరు కొండల్ రెడ్డి , ఉపసర్పంచ్ నవీన్ కుమార్ , వార్డు సభ్యులు ా సత్యనారాయణ , ఖ మధుకర్ , వీ రేవంత్ , ఖ రాజశేఖర్ , ా నవీన్ , మమతా మహేందర్ , ా లక్ష్మి అంజయ్య , మేరీ ప్రతాప్ రెడ్డి , జీ విజయలక్ష్మి కృష్ణ మరియు సెక్రటరీ వెంకటయ్య గార్లు , గ్రామ పెద్దలు సిబ్బంది పాల్గొన్నారు

పూల పండుగకు ఇబ్రహీంపట్నం పులకింత

- మహిళలకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి తీపి కబురు..

- 100 పడకల ఆసుపత్రి, ప్రత్యేక ఆడిటోరియం ఏర్పాటుకు హామీ





ఇబ్రహీంపట్నం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ వేడుకలు ఇబ్రహీంపట్నంలో వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన సంబరాలు పూల పరిమళాలు, సంప్రదాయ గీతాలు, మహిళల ఆటపాటలతో సందడిగా సాగాయి. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను తీసుకొచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. చౌరస్తాలో కొలువుదీరిన పూల బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. పెద్ద సంఖ్యలో ఆడపడుచులు తరలిరావడంతో పట్టణమంతా పండుగ శోభను సంతరించుకుంది. ఎమ్మెల్యే తనయుడు అభిషేక్ రెడ్డి, ఆయన సతీమణి వేడుకల్లో పాల్గొని మహిళలను ఉత్సాహపరిచారు. అందంగా అలంకరించిన బతుకమ్మలను ఎంపిక చేసి విజేతలకు బహుమతులు అందజేశారు.

మహిళలకు ప్రత్యేక ఆడిటోరియం!

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నంలో త్వరలోనే 100 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది బతుకమ్మ వేడుకలను మరింత ఘనంగా నిర్వహించుకునేందుకు మహిళలకు ప్రత్యేక ఆడిటోరియం ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిగిరింత పారిజాతతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గుర్నాథ్ రెడ్డి, వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో డీసీపీ ఆకస్మిక తనిఖీ

- 20 సీసీ కెమెరాలు ప్రారంభం..

- కేసుల దర్యాప్తుపై అధికారులకు దిశానిర్దేశం



ఆదిభట్ల: శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ గురువారం ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో డీసీపీ మొక్కలు నాటి పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం రతన్ టాటా పీజీ కాలేజీ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ప్రజల భద్రతను బలోపేతం చేయడంతోపాటు నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయని డీసీపీ పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, వివిధ సెక్టార్ల పరిధిలో ఎస్ఐల ఆధ్వర్యంలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తులు, నేరాల నమోదు తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు సత్వర న్యాయం అందేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేష్, సైదయ్య, సత్యనారాయణ, సుందరయ్య, నోయెల్ రాజ్, సోమయ్యతోపాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పోరు

– 17 వేల మంది సమస్యలు పరిష్కరించాలి..

– సమాన పనికి సమాన వేతనం, ఔట్‌సోర్సింగ్ రద్దు, అర్హులకు క్రమబద్ధీకరణ చేపట్టాలి

: టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గాజే వేణుగోపాల్



నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గాజే వేణుగోపాల్ డిమాండ్ చేశారు. వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ కూడలిలో నిరవధిక సమ్మె చేస్తున్న ఉద్యోగులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కొన్ని ఉద్యోగ వర్గాలకు తగ్గించిన వేతనాలను సవరించాలని, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి రాష్ట్ర ఆరోగ్య సొసైటీ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేయరాదని, వారి పోరాటానికి టీఎన్జీవోస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని ప్రయోజనాలు కల్పించాలని, పొరుగు సేవల విధానాన్ని రద్దు చేసి అర్హులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని డిమాండ్ చేశారు. అర్హులైన మహిళా ఉద్యోగినులకు 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు క్యాడర్ నిర్ధారణ చేపట్టి వంద శాతం స్థూల వేతనం చెల్లించాలని కోరారు. కాంటింజెంట్ కార్మికుల నుంచి వైద్యుల వరకు అర్హులైన ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ నగర అధ్యక్షుడు శంకేశి రాజేష్, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ భరత్ కుమార్, నితిన్, అర్చన, అనిల్, అనూష, సుజాత, సునీతతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.